ఉన్నప్పుడు అందులో శాంతి వస్తూ ఉంటే ఆ మార్గంలో ప్రయాణం చెయ్యండి. మీకు ఇష్టులు ఎవరైనా, ఏదైనా ఆటంకాలు కలిగించినా వాటిని గెంటి, ముందుకు వెళ్ళిపోండి. మీ సంసారంలో ఏవైనా ఇబ్బందులు వచ్చినా కంగారుపడవద్దు, వాటికి పూర్వజన్మలకి సంబంధం ఉంటుంది, వాటిని అనుభవిస్తే పోతాయి. మనకు రెండు విద్యలు ఉన్నాయి, ఒకటి పారమార్థికం, రెండవది వ్యవహారికం, ఈ రెండుఅవసరమే మనం మోక్షం పొందటానికి పారమార్థికం, ఇతరుల చేత మోసపడకుండా చూసుకోవటానికి వ్యవహారిక జ్ఞానం. మనం ఇతరులను మోసంచేయకూడదు, ఇతరులయొక్క మోసంలో పడకూడదు. మనం సత్వగుణాన్ని అలవాటు చేసుకొంటున్నాము అనుకోండి, లోపలశాంతిని పెంచుకొంటున్నాము అనుకోండి మనకుటుంబంలోగాని, బయటగాని పరిస్థితులు వ్యతిరేఖంగా ఉన్నా కాలక్షేపంచేసి బయటకు వెళ్ళిపోవచ్చు, లోపలశాంతి ఉంటే అందులోనుండి ఆశక్తినీకు వస్తుంది. లోపలశాంతిని కాపాడుకొంటే బయట నుండి వచ్చే వత్తిడులను, కుటుంబపరంగా వచ్చే వత్తిడులను, సమాజపరంగా వచ్చే వత్తిడులను తట్టుకొనేశక్తి మనకు వస్తుంది.

కోరిక ఒక తలంపు, కోపం ఒక తలంపు, చావు ఒక తలంపు, పుట్టుక ఒక తలంపు జీవితంలో అన్నీ తలంపులే. నీకు ఎన్నితలంపులు వస్తూఉన్నా కంగారుపడవద్దు, ఈ తలంపులు ఎంతకాలం అయితే వస్తూ ఉంటాయో అంతకాలం నేను ఎవడను అనే ప్రశ్నను విడిచిపెట్టవద్దు. అది ఈ తలంపులన్నింటిని నాశనంచేసి చివరకు ఆతలంపు కూడానశిస్తుంది, అప్పడు నిజమైననేను నీకు తానుగా వ్యక్తమవుతుంది. నీకు ఏదైనా కష్టాలు వస్తూఉంటే కష్టాన్ని కష్టంగా చూడటం మానివెయ్యి, నీదృష్టి మార్చుకొంటే కష్టం కష్టంగా కనబడదు, నీ దృష్టిలో ఉన్న దోషాన్ని తీసివెయ్యి, భక్తుడికి భగవంతుడి యొక్క రూపాన్ని చూస్తూఉంటే ఒక్క కళ్ళేకాదు అన్నీ ఇంద్రియాలు ఆనందంలో తొనికిసలాడతాయి. భక్తుడు కానివాడికి అది రాయి కాని భక్తుడికి ఆరూపాన్ని చూసేటప్పటికి అన్ని ఇంద్రియాలు చల్లబడిపోతాయి, అన్ని ఇంద్రియాలకు ఆనందం వచ్చేస్తుంది. ఎవరైనా విమర్శిస్తే మీకు దుఃఖం వస్తుంది, అది ఒక ఫీలింగ్. ఎవరైనా స్తోత్రం చేస్తే మీకు సంతోషం వస్తుంది, అది ఒక ఫీలింగ్. ఈఫీలింగ్‌లే మనకొంపముంచుతున్నాయి. వీటిని వదిలివేస్తే మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది. సత్యాన్వేషణ ఒక్కటే ప్రధానం కాని మిగతా ఫీలింగ్స్ ఏమీ పట్టించుకోవద్దు. ఈశరీరం మరణించకముందే మనబుద్ధిలో ఉన్న దోషాలను శేషంలేకుండా తొలగించుకోవాలి. ఆ తొలగించుకొనే శక్తిని ఇమ్మని మనం పరమేశ్వరుని ప్రార్థించాలి. మనం ప్రార్థించవలసింది అదే. అదే మొదటి ప్రార్థన, అదే చివరి ప్రార్థన.





ఎందుచేతనంటే శరీరం మరణించే లోపు బుద్ధిలో ఉన్నదోషాలు తొలగించుకోకపోతే మరల కొత్త శరీరాలు వచ్చేస్తాయి. జీవులు రకరకాలుగా ఉంటారు, జీవులందరు మోక్షాన్ని అడగరు ధర్మ అర్ధ కామ మోక్షములను అడుగుతారు అందుచేత ధర్మాన్ని ఆచరించే బుద్ధిని ఇమ్మని అడిగేవారికి ఒకచెయ్యి, పైసాలు కావాలి అని అడిగే వారికి ఒకచెయ్యి, కోరికలు అడిగే వారికి ఒకచెయ్యి, ఇవి ఏమీ మాకు వద్దు మాకు మోక్షమే కావాలి అని అడిగే వారికి ఒక చెయ్యి ఇలాగ భగవంతుడు నాలుగుచేతులు పెట్టుకొన్నాడు. జీవులందరూ మోక్షాన్ని అడిగితే ఒక చెయ్యి సరిపోతుంది. మనలను ఎవరైనా ఆదరించేవారు ఉంటే మంచిదే కాని వారు మరణిస్తే ఆదరించే వారు మనకు కనబడరు అందుచేత మనం భగవంతుడి మీద ఆధారపడటం మంచిది. ఎందుచేతనంటే ఆచేతులకు చావులేదు. మనం ఆధార పడవలసిన చేతులు అవే. మీరు ఇతరులను అనుకరించవద్దు. మీకు నచ్చిన మార్గంలో ప్రయాణం చెయ్యండి, జ్ఞానగంగ మీ హృదయంలోనే ఉంది. మీరు లోపలకు వెళితే అది దొరుకుతుంది. వస్తువు ఎక్కడ ఉందో అక్కడ వెతకండి, అది మీకు దొరుకుతుంది.

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు, 31-1-03, గుండుగొలను

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

మనం సత్వగుణాన్ని పోషించుకొంటే మన హృదయంలో ఉన్న భగవంతుడికి దగ్గరవుతాము. మనం రజోగుణంలో, తమోగుణంలో ఉంటే ప్రపంచానికి దగ్గరవుతాము. మీరు ఎన్నిగంటలు జపంచేసినా, ధ్యానంచేసినా మీరు రజోగుణం తగ్గించుకోకపోతే, తమోగుణం తగ్గించుకోకపోతే భగవంతుడికి దూరమవుతారు. మన చేతులు పనిమీద ఉండాలి, మనస్సు శాంతిలో ఉండాలి. దానివలన ఏకాగ్రత పెరుగుతుంది, జ్ఞాపకశక్తి పెరుగుతుంది. పనియందు శ్రద్ధ పెరుగుతుంది. గురువు ఎలా ఉంటాడు అంటే ఇక్కడ భగవాన్ చెపుతున్నారు. వాడు శాంతిలో ఊగిసలాడుతూ ఉంటాడు. అది లౌకికమైన శాంతి కాదు. అది అలౌకికమైన శాంతి, అభౌతికమైన శాంతి. అది ఈ లోకానికి, ఈ భూమికి సంబంధించిన శాంతికాదు. కొంతమంది ఈ భూమి మీద ఉన్నా వారు భూమికి సంబంధించిన మనుషులు కాదు. వారే జ్ఞానులు. వారు మనలాగే తింటూ ఉంటారు, తిరుగుతూ ఉంటారు కాని వారు భూమికి సంబంధించిన మనుషులు కాదు. ఎందుచేతనంటే ఈ శరీరం భూమిలో కలిసిపోయినా మనం ఉంటాము అన్న సంగతి వారికి తెలుస్తూ ఉంటుంది. నిప్పుకి వేడి ఎంత సహజంగా ఉంటుందో వారికి శాంతి, దయ, ఓర్పు ఇవి అన్నీ అంత సహజంగా ఉంటాయి. ఈ సృష్టిలో ఉన్న దుఃఖం అంతా

వచ్చిన వాడిలో చలనం ఉండదు. అది జ్ఞాని యొక్క వైభవం. మన స్వరూపం శాంతి అయినప్పటికీ మన మనస్సు కల్పించిన రాగద్వేషముల వలన మనకు అశాంతి వస్తోంది. రాగద్వేషములు తగ్గుతూఉంటే శాంతి పెరుగుతుంది. భగవాన్ చెపుతూ ఉండేవారు, ఈ శరీరం పుట్టినప్పడు నువ్వు పుట్టలేదు. ఈ శరీరం పుట్టినప్పడు నీవు పట్టలేదు కాబట్టి ఈ శరీరం చనిపోయినప్పడు నువ్వు చనిపోవు. భగవాన్ చెప్పిన ఈ వాక్యాన్ని మనం నిరంతరం జ్ఞాపకం పెట్టుకోవాలి. మీ ఫోటో తీసుకొంటాము అని ఎవరైనా భగవాన్‌ను అడిగితే మీకు చేతనయితే తీసుకోండి అనేవారు. భగవాన్ అంటే ఎవరు? బ్రహ్మం. బ్రహ్మాన్ని ఎలా ఫోటో తీయగలరు. ఒక రూపం ఉంటే ఫోటో తీయవచ్చు కాని రూపం లేని దానిని ఎలా ఫోటో తీస్తారు. శరీరం పుట్టటం నిజం కాదు, శరీరం చనిపోవటం నిజం కాదు. ఇవి అన్నీ దొంగపుట్టకలు, దొంగ చావులు. శరీరం పుట్టినప్పడు నీవు పట్టలేదు. నేను అనే తలంపు పుట్టినప్పడు నీవు పుట్టావు. ఈ శరీరం చనిపోయినప్పడు నీవు చనిపోవు. నీవు చనిపోయాను అనుకొంటున్నావు, అది దొంగచావు. నేను అనే తలంపు ఎక్కడయితే పుట్టిందో అక్కడకు వెళ్ళి లయమయిపోతే అది నశిస్తుంది, అది నిజమైనచావు. ఈ దేహం చనిపోయిన తరువాత తిరిగి దేహం ఎవడికయితే రాదో వాడు నిజంగా చనిపోయినట్లు, అలాకాకుండా మరల ఇంకొక దేహం వస్తుంది అనుకోండి ఆ చావు నిజంకాదు. మిమ్మల్ని శాంతి సింహాసనం మీద కూర్చోపెట్టటం కోసమే ఈ ప్రవచనాలు అంతకంటే వేరే ప్రయోజనం ఏమీలేదు. మనస్సుకు విశేషాలు ఉన్నాయి. మనస్సుకు గుణాలు ఉన్నాయి కాని చైతన్యానికి విశేషాలు లేవు, గుణాలు లేవు. ఆ చైతన్యంతోటి తాదాప్యం పొందుతూ ఉంటే నీకు అశాంతి పత్తాలేకుండా పోతుంది. మీ తమ్ముడు అంటే మీకు ఇష్టమా అని భగవాన్‌ను అడిగితే అందరూ అంటే ఎలా ఇష్టమో మా తమ్ముడు అంటే కూడా అలాగే ఇష్టం అన్నారు అంటే అందరిలోను అతడూ ఒకడు. గురువు యొక్క వైభవం నోటితో చదవటం వలన, వినటం వలన తెలియదు నీ స్వరూపం నీకు తెలిసినప్పడు గురువు యొక్క వైభవం నీకు తెలుస్తుంది. ఎందుచేతనంటే నిజమైనగురువు నీ స్వరూపంగానే ఉన్నాడు. ఎప్పడు మీకు ఎఱుకపడాలి, ఎప్పడు మీకు శాశ్వతశాంతిని కలుగజేయాలి అని భగవంతుడు చూస్తున్నాడు. మీరు తొందరపడవద్దు, మోక్షం ఇస్తాడు, ఇంకా ఇవ్వలేదు ఏమిటి అని ఆయనను తొందరపెట్టవద్దు. ఇవాళ చేను ఊడ్చి, రేపు కోసేయాలి అంటే ఎలాగ, దానికి కొంత టైము పడుతుంది. అదే విధంగా మోక్షం కూడా మీకు ఎప్పడు ఇవ్వాలో ఆయన ఇస్తాడు, తొందరపడవద్దు. నీకు సత్యాన్వేషణబుద్ధి కలుగజేయటంకోసం నీకు కష్టాలు పంపుతాడు అంతేగాని నీ మీద ఇష్టంలేక కాదు. పిల్లలను మనం ఎప్పడైనా బయపెడతాము. భయపెట్టినప్పడు సడన్‌గా





వచ్చి మనలను కౌగిలించుకుంటారు. ఆయనలో ఐక్యం చేసుకోవటానికే భగవంతుడు కష్టాలు పంపుతున్నాడు. అవి నిజంగా కష్టాలు కాకపోయినా ఆయనను కౌగిలించుకోవటానికి వాటిని కష్టాలులాగ కనిపింపచేస్తాడు, వాడే ఈశ్వరుడు. గురువు నాకు చెప్పేది ఏమిటి, అని గురువుఅంటే ఇష్టం లేక గురువును విడచిపెట్టేస్తారు అనుకోండి, వాడు ఏమి చేస్తాడు అంటే మీకు తెలివిని ఇచ్చి, వివేకాన్ని ఇచ్చి మీ తెలివిచేత, వివేకంచేతమీకు పాఠాలు చెప్పిస్తాడు అంతే గాని మిమ్మల్ని విడిచిపెట్టడు, వాడు గురువు. మీరుఏమనుకుంటారు మన తెలివి వలననే మనకి తెలుస్తోంది, మనం పెద్దవాళ్ళం అయిపోయాము అనుకొంటారు. కాని ఆ తెలివిని ఇచ్చినవాడు గురువే. నేను మిమ్మల్ని కోరేది ఒక్కటే. మీ మీద విశ్వాసం మీరు ఎప్పడూ పోగొట్టుకోవద్దు. మీ హృదయంలో ఈశ్వరుడు ఉన్నాడు, ఆయన రక్షణలో మీరు ఉన్నారు. భగవంతుడి అస్తిత్వం మీద మీరు ఎప్పడూ సందేహపడవద్దు. దేహంఏపనిమీద వచ్చిందో ఆపని చేసుకొని వెళ్ళిపోతుంది, దానితో తాదాప్యం వదిలెయ్యి, అదినీవు కాదు కదా అంటారు భగవాన్. డబ్బుకు విలువలేదు, డబ్బునాకు కావాలి అనే తలంపు వలన దానికి విలువ వస్తోంది. అలాగే పదవికి విలువలేదు ఆపదవి నాకు కావాలి అనే తలంపు దానికి విలువనిస్తోంది. మనం ఆత్మలోనే ఉన్నాము. మనం ఏమీ అనుకోకుండా ఉంటే ఆత్మలోనే ఉంటాము. ధ్యానం చెయ్యి మంచిదే, కాని ధ్యానం చేసేటప్పడు కూడా నిన్ను నీవు విడిచిపెట్టి కొంతదూరం వెళ్ళిపోతున్నావు, నిన్ను నీవు పరిశీలించుకోవటం లేదు. ఏతలంపుకు ధ్యానం చేయాలని ఉందో ఆ తలంపును పట్టుకొని దాని మూలంలోనికి వెళ్ళు. నీ నిజమైన ఇల్లు అక్కడే ఉంది, చావులేనిస్థితి అక్కడే ఉంది, నిజం అక్కడే ఉంది. అక్కడికి వెళితే ఆనిజమే నీకు నేనుగా వ్యక్తమవుతుంది. మనం ఏదైనా మంచిపనిచేస్తే, ఎవరికైనా ఏదైనా ఇస్తే అది చేసి మర్చిపోతే అది మనలను బంధించదు, అది మర్చిపోకపోతే మనలను బంధిస్తుంది. సాధనచేసి ఏదో సాధించాలి అనుకొనేది మనమే, అది సాధించాను, ఇది చేసాను అని కల్పించుకొనేది మనమే. పిల్లలకు ఒక చేత్తో అన్నం పెట్టి, ఇంకో చేత్తో నెత్తిమీద మొట్టి అన్నం కక్కిస్తున్నారు అనుకోండి అది ఎలా ఉంటుందో మనం చేసే పనులు కూడా అలాగే ఉన్నాయి. అక్కడ సాధన చేసి మనస్సును చంపటానికి ప్రయత్నం చేస్తున్నావు, ఇక్కడ అది చేసాను, ఇదిచేసాను అని మనస్సును పెంచుకొంటున్నావు. ఇంక ఎక్కడికి వెళతావు, గానుగెద్దులాగ ఉంది మన జీవితం. తెల్లవారుజామున గంగానదిలో స్నానంచేయటం, చలిభరించలేక హేరామా, హేకృష్ణా అనటం. అది మీరు భక్తితో అంటున్నారా, చలిభరించలేక అంటున్నారా అది కూడా లోపలఉన్న ఈశ్వరుడు చూస్తూఉంటాడు. మేము సాధన బాగా చేస్తున్నాము అని మీకు

ఏదైనా తలంపు వచ్చింది అనుకోండి, ఆ తలంపుతో తాదాప్యం పొందవద్దు. ఏదో తింగర తలంపు వచ్చింది, ఆ తలంపుతోటి ఊరేగటం ఎందుకు అని అనుకొని ఆతలంపును వదులుకోండి, అదేసాధన, తలంపు వస్తే రానివ్వండి. దానితో మీరు జతకట్టకండి. జతకట్టకపోతే అదే పోతుంది. మేముతెల్లవారుజామున చన్నీళ్ల స్నానం చేస్తున్నాము అని అంటే మీరు చేయలేని పనిని మేము చేస్తున్నాము అని చెప్పటం, అంటే అహంభావన అక్కడ సూక్ష్మరూపంలో ఉంది. హిమాలయాలలో వేసవి కాలంలో స్నానం చేస్తేనే చలిగా ఉంటుంది. అక్కడ స్వాములు కొంతమంది స్నానం చేస్తూ పెడబొబ్బలు పెడుతూఉంటారు అంటే దేహభావన ఎక్కువ ఉంది అని అర్థం. ఈ దేహం నిజంకాదు అనే భావన వారికి కలిగినప్పుడు చలిబాధ అంత ఉండదు, దానిని భరించగలుగుతారు. నాకు దేవుడు అంటే ఇష్టం ఉండదు, నాకు ధర్మం అంటే ఇష్టం నాన్నగారు అని ఒకరు చెపుతున్నారు. దేవుడికి మరోపేరే ధర్మం అని చెప్పాను. ధర్మం అంటే దానం అని కాదు, అదిఒక జీవితవిధానం. ధర్మానికి వేరుగా భగవంతుడు లేడు, భగవంతుడు ధర్మస్వరూపుడు, నా గురువు ఎవరు అని ఒకరు భగవాన్‌ను అడిగారు. నేనే నీగురువు అని చెపుతారు అని అతను అనుకొన్నాడు, ఆయన ఎందుకు అలా చెపుతాడు, అసలు సృష్టేలేని వాడికి గురువు శిష్యుడు ఏమిటి. ఎవరి సమక్షంలో ఉన్నప్పుడు నీ ప్రయత్నంతో సంబంధంలేకుండా ఆటోమేటిక్‌గా సాధన జరుగుతూ ఉంటుందో, ఎవరి సమక్షంలో ఉన్నప్పుడు నీ మాటలు, తలంపులు ఆగిపోతాయో ఆయనే నీగురువు అని చెప్పారు. మంచితనం కూడా సామాన్యంకాదు ఎంతో కష్టపడితేగాని మంచితనం రాదు. మంచితనం లేకపోతే జ్ఞానం ఎలా వస్తుంది. నీ హృదయంలో ఎంతో కొంత మంచితనం లేకపోతే సృష్టిలో ఉన్న సౌదర్యం నీకు గోచరంకాదు. అదే భగవాన్ చెపుతూ ఉంటారు. నీకు అర్హత లేనప్పుడు, లోపల ప్రిపరేషన్ లేనప్పుడు కళ్ళుఉన్నా చూడలేరు చెవులున్నా వినలేరు. గాంధీగారు మహాత్ముడు అవ్వటానికి ఒకటే కారణం ప్రతివాడికి వాడి ప్రాణం అంటే చాలా ఇష్టం కాని ఒకమంచిపని కోసం ఆయన ప్రాణాన్ని గడ్డిపరకలాగ విడిచి పెట్టటానికి ఎప్పుడూ సిద్ధంగా ఉన్నాడు, వాడు గాంధీ. నేను మోక్షం పొందాలంటే కృషి ఒక్కటే సరిపోతుందా, గురుకృప ఉండాలాఅని ఒకరు అడుగుతున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే నీకు మోక్షం పొందాలి అనే తలంపు కలుగచేసినవాడు కూడా గురువే, మోక్షం పొందాలి అనే తలంపు నీకు రావటంకూడా అది గురుకృపవలననే వచ్చింది. గురుకృప లేకపోతే నీకు ముముక్షత్వంరాదు. నీకు అమృతత్వం కలిగాక తెలుస్తుంది. నీవు చేసింది తక్కువ, గురువు యిచ్చింది ఎక్కువ అని, అంతా గురువే. భగవాన్ నాకు స్వప్న దర్శనం ఇచ్చి నన్ను ముద్దుపెట్టుకొంటూఉంటే నాకు సంతోషం కలుగలేదు, భయంకలిగింది. నన్ను విడిచిపెట్టేయి అంటున్నాను, విడిచిపెట్టేసమస్యేలేదు అని ఆయన అంటున్నాడు. అది ఏనాటి అనుబంధమో చెప్పలేము. ఆయన పేరు ఎప్పుడూ నేను వినలేదు, ఎవరైనా గురువులు చెపుతూ ఉంటే కూడా వినలేదు, కావాలని తెచ్చుకోలేదు. పైగా తెంచుకోవాలంటే తెంపుకొనే బంధంకాదు. ఆసంకెళ్ళు తెంచుకోవాలంటే అవికనబడితే తెంపుకోవచ్చు అసలు కనబడకుండా ఉంటే ఎలా తెంచుకోగలము. ఈ శరీరం మరణించినా రాబోయే జన్మలో కూడా గురువు నిన్ను విడిచిపెట్టడు. వీడు ఎక్కడ ఉన్నాడు, ఎక్కడ శరీరం ధరించాడు అని వెంటాడుతాడు. ఆయన మీద ప్రేమ కలిగేటట్లు కూడా ఆయనే చూసుకొంటాడు, మన అహంకారం ఏమిప్రేమిస్తుంది గురువు యొక్క దయ మహాప్రవాహంలాంటిది. అది ఈ రూపంలోనుండి, ఈ నామంలోనుండి మనలను విడుదలచేసి జ్ఞానంలో ఐక్యం చేస్తుంది, వాడే గురువు. నీవు ఏదైనా చెడుస్నేహాలలో ఉన్నావు అనుకో, ఆ బేడ్‌కంపెనీ వలన నీవు ఎక్కడికి పోతావో గురువుకు తెలుసు అందువలన ఆ బేడ్‌కంపెనీలో నుండి నిన్ను విడుదలచేయటానికి ప్రయత్నంచేస్తాడు, వాడు గురువు. నిన్న ఎవరో ఫోన్‌చేసి మా కుటుంబపరిస్థితులు బాగాలేవు, బాగాలేకపోయినా ఫరవాలేదు వాటిని తట్టుకొనే శక్తిని ఇవ్వండి అని అడుగుతున్నారు. అప్పుడు నేను చెప్పాను. ఈశ్వరుడు చేసేపని అదేఅని చెప్పాను. మీదయచూపించండి అని గురువును అడుగనక్కరలేదు, గురువు దయాస్వరూపుడు ఎంతోకొంత అభ్యాసం చేస్తున్నాను, బాగా చేస్తున్నాను అని చెప్పలేను అని అంటున్నాడు. నువ్వేదో చేస్తున్నాను అనుకొంటున్నావు. అభ్యాసం చేయించే వాడు గురువే, అభ్యాసం కూడా గురువే, అంతా గురువే, గురువు యొక్క దయలేకపోతే నీకు అసలు అభ్యాసం చేయాలనే తలంపుకూడా రాదు. నీవు అభ్యాసం చేయగా చేయగా అవసరమయితే నీలోపలఉన్న ఆత్మే నీకోసం కాళ్ళుచేతులు తొడుక్కొని వస్తుంది, వాడే గురువు. .నీతో మాట్లాడుతూ, నీతో కలిసి తిరుగుతూ ఈ జీవుడిని హృదయగుహలోనికి నెట్టేస్తాడు, నీకు తెలియకుండా పనిజరిగిపోతుంది. నీ దయ కావాలి అని భగవంతుడిని అడగనక్కరలేదు, అది గుర్తించటానికి నీకు అర్హత ఉండాలి. నీవు గుర్తించినప్పుడు దయవుంది, నీవు గుర్తించనప్పుడు కూడా దయవుంది, గుర్తిస్తే అది నీకు తెలుస్తుంది. గుర్తించకపోతే తెలియదు కాని దయ ఎప్పుడూ ఉండనే ఉంది, అదిలేని క్షణం అంటూలేదు. గురువు రూపం ఉన్నప్పడూ రూపం లేనివాడే, ఒకనామం ఉన్నప్పడూ నామంలేనివాడే అది గుర్తించిన వాడు ధన్యుడు.

20-02-2003

రమణ భాస్కర